క్లుప్తంగా

నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలి



దయార్‌గూడలో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని దయార్‌గూడలో రూ.19లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నిధులతో దాదాపు అన్ని పనులు పూర్తి చేసుకున్నామన్నారు. సీసీ రోడ్డు పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ సూర్య, కూకట్‌పల్లి నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొట్టు విష్ణు, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, నాగరాజు, వెంకటేష్, శివ, నర్సింగ్‌రావు, యాదగిరి, మధుసూదన్, ప్రేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వయం శక్తితో ఎదగాలి

మోతీనగర్: శివాజీనగర్ జై భవాని మహిళా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి కార్పొరేటర్ సబిహా బేగం హాజరై మాట్లాడారు. మహిళలు స్వయం శక్తితో ఎదగాలని సూచించారు. శివాజీనగర్‌లో స్వయం ఉపాధి కోర్సుల కోసం మరో సెంటర్ ఏర్పాటుచు కృషి చేస్తానన్నారు.మహిళలను ఈ కోర్సుల్లో చేరి ఉపాధి పొందాలన్నారు. నాయకులు వీరారెడ్డి, జ్ఞానేశ్వర్, ఎల్లం, బాలయ్య సత్తయ్య, తులసీరాం, మధురాచారి, గీత, ఇందిరా, అనురాధ, స్వాతి, కవిత, రమాదేవి, అఖిల, వరలక్ష్మి, ఆరతి, నాగ తదితరులు పాల్గొన్నారు.

వీడీసీసీ రోడ్డు పనుల పరిశీలన



వాల్మీకినగర్‌లో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

బాలానగర్: వాల్మీకి నగర్‌లో చేపట్టిన నూతన వీడీసీసీ రోడ్డు పనులను మంగళవారం కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్, ఈఏ పవన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలో వాడవాడలా మంచినీటి వసతి, డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరణ, నూతన రోడ్లు వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీహరి, రాముగౌడ్, బగయ్య, ఇమ్రాన్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

7వ తేదీలోపు రైతుబంధు నమోదు చేయించుకోవాలి

దుండిగల్: ఈనెల 7వ తేదీలోపు రైతుబంధు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మాధవరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. బ్యాంక్ అకౌంట్‌లో డబ్బులు పడుతున్న రైతులు మినహాయించి ఇప్పటి వరకు రైతు బంధు నమోదు చేయించుకోని వారు కొత్తగా నమోదు చేయించుకోవాలన్నారు. పట్టాదార్ పాస్‌బుక్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను మండల వ్యవసాయ కేంద్రంలో అందజేయాలని కోరారు. పత్రాలు సమర్పించని వారికి రైతుబంధు వర్తించదని పేర్కొన్నారు. వివరాలకు ఫోన్ నం.72888 94684లో సంప్రదించవచ్చు.

వెటర్నరీ ఆసుపత్రి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని కూకట్‌పల్లి గ్రామంలోని వెటర్నరీ ఆసుపత్రి పనులను మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. పనులను 20వ తేదీలోగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు తెలిపారు.

మన్యం వీరుడికి
ఘన నివాళులు



భాగ్యనగర్‌కాలనీలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, అరెకపూడి గాంధీ







నివాళులర్పిస్తున్న బీజేపీ సీనియర్ నాయకుడు రవికుమార్‌యాదవ్, మాజీ కార్పొరేటర్లు జానకీరామరాజు, గొట్టిముక్కల వెంగళరావు

స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు, కార్పొరేటర్‌లు, నాయకులు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అల్లూరి మహోజ్వలశక్తి అని ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య పోరాటంలో ఒక ప్రత్యేక అధ్యాయమని తెలిపారు. సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం వస్తుందని నమ్మి ఆ పోరాటంలోనే ప్రాణాలర్పించిన మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. – భాగ్యనగర్‌కాలనీ



హెచ్‌సీయూ-డ్రిల్స్ అవగాహన ఒప్పందం

అకడమిక్, పరిశోధనా రంగాల్లో పరస్పర సహకారం



ఒప్పంద కార్యక్రమంలో పాల్గొన్న వీసీ ప్రొ.బీజేరావు, ఇరు సంస్థల ప్రతినిధులు

రాయదుర్గం: అకడమిక్, పరిశోధనా రంగాల్లో పరస్పరం సహకరించుకోవాలని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, డ్రిల్స్ సంస్థ నిర్ణయించాయి. ఈ మేరకు మంగళవారం హెచ్‌సీయూ, డాక్టర్ రెడ్డీస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ (డ్రిల్స్) మధ్య పదేళ్ల పాటు ఉమ్మడి విద్య, పరిశోధనా కార్యకలాపాల కోసం అవగాహనా ఒప్పందాన్ని కుదర్చుకున్నాయి. ఈ ఒప్పందంపై హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు సమక్షంలో హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్, డ్రిల్స్ సంస్థ కో చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, డ్రిల్స్ బోర్డు చైర్మన్ జీవి ప్రసాద్ సంతకాలు చేశారు. అధునాతన ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ రంగంలో విశ్వవిద్యాలయ విద్యార్థులు, పరిశోధకులకు నైపుణ్యాభివృద్ధికి డ్రిల్స్ సంస్థ మద్దతు ఇస్తుంది. హెచ్‌సీయూ నుంచి ప్రొఫెసర్ శర్మిష్ఠ బెనర్జీ, డ్రిల్స్ నుంచి డాక్టర్ శ్రీనివాస్ ఓరుగంటి సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారు.

రూ.1.83కోట్లతో చెరువు సుందరీకరణ పనులు



సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: ఆలీతలాబ్ చెరువు సుందరీకరణలో భాగంగా 1 కోటి 83 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపడుతున్న అలుగు నిర్మాణం, పైపులైన్ నిర్మాణ పనులను మంగళవారం ఇరిగేషన్ అధికారులతో కలిసి కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకప్పుడు మురికికూపంలా ఉన్న అలీ తలాబ్ చెరువుకు మహర్దశ పట్టించిందన్నారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సహకారంతో చెరువు సుందరీకరణ, సంరక్షణ, అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. చెరువు కట్ట పటిష్ఠం చేసి, మురుగునీరు చెరువులో కలవకుండా ప్రత్యేకంగా చెరువు చుట్టూ నిర్మించే మురుగునీటి కాల్వ నిర్మాణం, అలుగు మరమ్మతులు, చెరువు కట్ట పునరుద్ధరణ పనులతో పాటు వాకింగ్‌ట్రాక్ వంటి పనులు కూడా చేపడుతున్నామన్నారు. చెరువు ప్రాంతం ఆక్రమణకు గురి కాకుండా చెరువు చుట్టూ కంచె నిర్మాణం చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఏఈ విశ్వం, శ్రీధర్‌రెడ్డి, డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఐఐహెచ్‌ఎంలో హాస్పిటాలిటీ స్కిల్ కోర్సు ప్రారంభం

గచ్చిబౌలి: అడ్మిషన్ రోజే ఉద్యోగం కల్పిస్తామని ఐఐహెచ్‌ఎం (ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్) చైర్మన్ డాక్టర్ సుబోర్న్ బోస్ పేర్కొన్నారు. మంగళవారం గచ్చిబౌలిలోని ఐఐహెచ్‌ఎం హైదరాబాద్ డైరెక్టర్ ఎర్నెస్ట్ ఇమాన్యుయేల్ పర్యవేక్షణలో వర్చువల్‌గా 'హాస్పిటాలిటీ స్కిల్స్' షార్ట్‌టర్మ్ కోర్సును ప్రారంభించారు. ఆతిథ్య రంగంలో నైపుణ్యం కల్గిన ఉద్యోగుల కొరత ఉందని,ఈ కోర్సులో చేరిన వారికి అదే రోజు ఉద్యోగం కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హయత్ కార్పొరేషన్ డైరెక్టర్ మోసం భట్టాచార్య, ప్రముఖ చెఫ్ చలపతిరావు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల సమస్యల పరిష్కారానికి కృషి



రహమత్‌నగర్(బోరబండ): బోరబండ సైట్-3 బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో నెలకొన్న సమస్యలను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని జూబ్లీహిల్స్ నియోజక వర్గ బీజేపీ నాయకులు లంకాల దీపక్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన గురుకుల పాఠశాలను సందర్శించి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాల వసతులపై పాఠశాల నిర్వాహకులు నివేదికలు అందజేస్తే కేంద్రమంత్రితో చర్చించి నిధులు విడుదల చేయిస్తానన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్న బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ సుజాత కుమారిని బదిలీ చేయాలని కోరుతూ ఆయన రాష్ట్ర గురుకుల పాఠశాలల డిప్యూటీ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రసాద్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపి అధ్యక్షుడు కొత్త వెంకటేష్,మహిళా నాయకురాలు షర్మిల జాదవ్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కొరత లేకుండా చూస్తాం



పాఠశాల సమస్యలను హెచ్‌ఎంను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సిబ్బందితో మంగళవారం ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని సుమారు 500 మందికి పైగా విద్యార్థులు ఉన్నారని.. కేవలం 11 మంది ఉపాధ్యాయులు ఉండటంతో పిల్లలకు పాఠాలు చెప్పటం సమస్యగా మారిందన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ సమస్యను ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కలెక్టర్‌ల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, హెచ్‌ఎం రాధాపద్మజ, ఎస్‌ఎంసీ చైర్మన్ మల్లయ్య మోహన్‌రావు, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీఓ.59 దరఖాస్తుదారులకు మరో అవకాశం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి మండల పరిధిలోని జీఓ.59కింద దరఖాస్తు చేసుకున్న వారికి మరో అవకాశం కల్పిస్తున్నట్లు కూకట్‌పల్లి తహసీల్దార్ గోవర్ధన్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నోటీసులు అందినా డబ్బులు చెల్లించని వారికి ఇది మంచి అవకాశమన్నారు. తదుపరి డబ్బులు చెల్లించని వారి ఇళ్లకు విద్యుత్ సప్‌లై నిలిపివేయాలని విద్యుత్ శాఖ అధికారులకు తెలిపామని పేర్కొన్నారు.

టీహెచ్‌సీహెచ్‌ఏఏ అధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి

భాగ్యనగర్‌కాలనీ: తెలంగాణ హెల్త్ కేర్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ అసోసియేషన్ (టీహెచ్‌సీహెచ్‌ఏఏ) ఎన్నికలను మంగళవారం ఆల్విన్‌కాలనీలోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించారు. అధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడిగా డా. గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా ప్రేమ్, మనోజ్‌రెడ్డి, సభ్యులు శ్రీకాంత్, రాహుల్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, రచన, పల్లవి, హర్ష, జశ్వినీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, హాస్పటల్స్ కార్పొరేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

చైన్ స్నాచర్ అరెస్టు

బాలానగర్: కంచర్ల జమున అనే మహిళ గత నెల 30వ తేదీన గిరినగర్‌లోని కూరగాయల మార్కెట్‌కు వచ్చి వెళ్తుండగా గురుమూర్తి నగర్‌లోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో వి. భానుప్రకాష్ ఆమె మెడలోని 3 తులాల బంగారపు తాడు తెంపుకొని వెళ్లిపోయాడు. ఆమె కింద పడిపోయింది. జమున ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేసి భానుప్రకాష్‌ను అరెస్టు చేసి బంగారు గొలుసును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు బాలానగర్ పోలీసులు తెలిపారు.

108 కలశాలతో ప్రత్యేక పూజలు

బాలానగర్: డివిజన్ పరిధిలోని శ్రీకళ్యాణినగర్‌లోని శ్రీసాయి నాగేంద్ర ఆలయంలో మంగళవారం 108 కలశాలతో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సద్గురు సాయినాద్ మహరాజ్, నాగేంద్రుడు, నాగమాతకి పూజలు నిర్వహించారు.

ఆలయ హుండీ లెక్కింపు..

ఫతేనగర్‌లోని శ్రీ పోచమ్మతల్లి దేవాలయంలో మంగళవారం హుండీ లెక్కించారు. రూ.76,780 ఆదాయం వచ్చింది. బోనాల సందర్భంగా ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేస్తున్నట్లు మహేందర్ యాదవ్ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

అమీర్‌పేట: బీకేగూడ శ్రీరామ్‌నగర్ కాలనీలో నెలకొన్న సమస్యను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి హామీ ఇచ్చారు. కాలనీ వాసులు విజ్ఞప్తి మేరకు మంగళవారం స్థానికంగా పర్యటించారు.వర్షపు నీటితో పాటు మంచినీరు తక్కువగా సరఫరా అవుతుందని కాలనీ వాసులు ఆమె దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని శేషుకుమారి చెప్పారు.

స్వచ్ఛ భారత్ అభియాన్

వెంకటేశ్వరకాలనీ: నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్ (ఎన్ఎస్ఎస్ఓ) ఆధ్వర్యంలో మంగళవారం గోల్కొండ కోటతో పాటు పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంస్థకు చెందిన 80 మంది ఉద్యోగులు, సిబ్బంది వ్యర్థాలను తొలగించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు అవగాహన కల్పించారు. అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ నిర్వహించారు. డీడీ శివపార్వతీరెడ్డి, ఏడీ బర్కత్ అలీ, జయరామ్ పాల్గొన్నారు.

69 మందికి కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు

ఆల్విన్‌కాలనీ: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం ద్వారా మంజూరైన 69 మంది లబ్ధిదారులకు సుమారు 69 లక్షల 8వేల 4 రూపాయల ఆర్థిక సహాయాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం కింద చెక్కులను ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తూ సంక్షేమ ప్రభుత్వంగా పేరుగాంచిందన్నారు. సంక్షేమ పథకాలను ఎటువంటి లోటు రాకుండా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ పేదలకు ఎంతో ఆసరాగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌లు దొడ్ల వెంకటేష్‌గౌడ్, నార్నే శ్రీనివాసరావు, జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, నాయకులు సంజీవరెడ్డి, లక్ష్మీనారాయణ, హరీష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులకు నిధులు విడుదల చేయాలి



హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఎండీ దానకిషోర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని యూజీడీ పైప్‌లైన్లు, పూడికతీత, మాన్‌హోల్స్ మరమ్మతులు నిమిత్తం నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఎండీ దానకిషోర్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాబోయే వర్షాకాలం దృష్ట్యా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా మాన్‌హోల్స్ పూడికతీత పనులకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రంలో కోరామని తెలిపారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని అన్నారు. అదే విధంగా పూడికతీత పనులకు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కృష్ణయ్యను కలిసిన జేబీ రాజు



ఆర్.కృష్ణయ్యకు అంబేడ్కర్, రమాబాయిల చిత్రపటాన్ని బహూకరిస్తున్న జేబీ రాజు

మోతీనగర్: ఆంధ్రప్రదేశ్ రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్యను మంగళవారం రాష్ట్ర దళిత సేన జాతీయ చైర్మన్ డా. జేబీ రాజు, గంటా మల్లేష్, రెడ్డిమల్ల పార్వతీ కలిశారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్యకు శాలువాతో సన్మానించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, రమాబాయిల చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్. చెన్నయ్య, సుజ్జి, రెడ్డిమల్ల నర్సింగ్‌రావు, హనుమంతు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటం

లాలాపేట: తెలంగాణలోని యూనివర్సిటీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం అవుతున్నట్లు సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఓయూ ఆర్ట్స్ కళాశాలలోని న్యూ సెమినార్ హాల్లో ఓయూ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను తక్షణమే పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

'కాల్ హెల్త్'.. ఇంటి వద్దకే వైద్య సేవలు



రాంకీ టవర్స్‌లో కాల్‌హెల్త్ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న వైద్యులు

హఫీజ్‌పేట్: కాల్ హెల్త్ ద్వారా ఇంటి వద్దకే వైద్య సేవలు ప్రారంభించారు. మంగళవారం గచ్చిబౌలిలోని రాంకీ టవర్స్‌లో కాల్‌హెల్త్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ పీబీఎస్ చౌదరి, డాక్టర్ అమానుల్లాలు మాట్లాడుతూ డాక్టర్లు, రక్త పరీక్షలు, బీపీ చెకప్, ఈసీజీ, డయాగ్నస్టిక్స్, సీజీఎం (కంటిన్యూస్ గ్లూకోజ్ మానిటరింగ్), ఈఈజీ (ఎలక్ట్రోనిసెపలోగ్రాం), హోల్టర్ మానిటరింగ్, ఆడియోమెట్రి, స్పీచ్ థెరపీ నిరంతరాయ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. కాల్‌హెల్త్ హెల్ప్‌లైన్, యాప్ ద్వారా ఈ సేవలను పొందవచ్చన్నారు.

దొడ్డి కొమురయ్య త్యాగం చిరస్మరణీయం



దొడ్డి కొమురయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, కురుమ సంఘం నాయకులు

సాయుధ పోరాట తెలంగాణ యోధుడు దొడ్డి కొమురయ్య త్యాగం చిరస్మరణీయమని ఓల్డ్ బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. మంగళవారం దొడ్డి కొమురయ్య వర్ధంతిని అంజయ్యనగర్‌లో కురుమ సంఘం నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా దొడ్డి కొమురయ్య విగ్రహానికి కార్పొరేటర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఐలేష్, బెల్లం ఐలయ్య, లింగం, నర్సింగ్‌రావు, సత్యనారాయణ, కనకరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు. – ఓల్డ్ బోయిన్‌పల్లి

ప్రపంచ యువతకే ఆదర్శప్రాయుడు
స్వామి వివేకానంద



స్వామివివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: స్వామి వివేకానంద వర్ధంతిని మంగళవారం వివేకానందనగర్ కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద విగ్రహానికి బీజేవైఎం నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమార్ యాదవ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతీయ సనాతన ధర్మం గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహానీయుడన్నారు. ప్రపంచ యువతకే ఆదర్శప్రాయుడు స్వామి వివేకానంద అని అన్నారు. ఎంతో మంది యువతకు ప్రేరణ కలిగించిన గొప్ప మేధావి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు భూపాల్‌రెడ్డి, రాజిరెడ్డి, గోపాల్‌రావు, రవీందర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి మోహన రంగాకు ఘన నివాళులు

పేదల కోసం పనిచేసి వారి గుండెల్లో నిలిచిపోయిన గొప్ప నేత వంగవీటి మోహనరంగా అని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం వంగవీటి మోహన రంగా జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వంగవీటి విగ్రహాలు, చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. – కూకట్‌పల్లి



కేపీహెచ్‌బీకాలనీలో వంగవీటి మోహన రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు